జగనన్న మళ్లీ సీఎం కావడం ఖాయం

- ప్రతిపక్షాల కుట్రలు, కుతంత్రాలు ప్రజలు గమనిస్తున్నారు
- జగనన్న రోడ్డు షోకు అడుగడుగునా బ్రహ్మరథం
- మీడియా సమావేశంలో ఎంపీ భరత్ రామ్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ భరత్‌రామ్. చిత్రంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: ముఖ్యమంత్రి వైఎస్ జగనమోహన్‌రెడ్డి మేమంతా సిద్ధం యాత్రలో భాగంగా జిల్లాలో నిర్వహించిన రోడ్డు షో ప్రతిపక్షాల వెన్నులో వణుకు పుట్టించిందని రాజమహేంద్రవరం ఎంపీ, వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్ రామ్ అన్నారు. శనివారం కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ రాజమహేంద్రవరం సిటీ, రూరల్, పరిధిలో సీఎం జగన్ రోడ్డు షోను మండుటెండను సైతం లెక్క చేయకుండా వేలాదిగా ప్రజలు స్వచ్ఛందంగా తరలివచ్చి విజయవంతం చేయడంపై ఆనందాన్ని వ్యక్తం చేశారు. సంక్షేమ పాలనతో ప్రజల హృదయాలలో జగనన్న నిలిచి పోయారనడానికి ఇదొక ఉదాహరణగా నిలుస్తుందన్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడా ఇటువంటి పాలన ఏ ప్రభుత్వం ప్రజలకు అందివ్వలేదన్నారు. రాష్ట్రంలో 66.7 లక్షల మందికి నెలనెలా పెన్షన్ల రూపంలో రూ.2,400 కోట్లు నేరుగా లబ్ధిదారులకు వలంటీర్ల ద్వారా అందజేయడం ఏ రాష్ట్రంలో లేదన్నారు. గతంలో చంద్రబాబు రైతులను, డ్వాక్రా మహిళలను రుణ మాఫీ చేస్తానని వాగ్దానం చేసి, తీరా అధికారంలోకి వచ్చాక మోసం చేశారని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పి యువతను నట్టేట ముంచేశారని ధ్వజమెత్తారు. చంద్రబాబు నోరు విప్పితే అన్నీ అబద్ధాలు, మోసాలేనని 2024 ఎన్నికలలో ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటు సక్రమంగా వినియోగించుకోవాలని పిలుపు నిచ్చారు. అమలుకు ఆచరణ సాధ్యం కానీ వాగ్దానాలతో చంద్రబాబు అండ్ కో ప్రజల ముందుకు వస్తున్నారని అప్రమత్తంగా ఉండాలన్నారు. విజయవాడలో సీఎం జగనన్నపై హత్యాయత్నం జరిగితే గులక రాయి తగిలితే ఇంత హడావుడా అని హేళన చేస్తున్న చంద్రబాబు కంటికో, కణతకో తగిలితే తెలిసేదన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని ఏకమైనా, వారెన్ని కుట్రలు పన్నినా మళ్లీ సీఎంగా జగన్‌మోహన్ రెడ్డి గెలవడం ఖాయమన్నారు. అధికారంలోకి వచ్చేది వైఎస్సార్ సీపీ ప్రభుత్వమేనన్నారు. ముఖ్యమంత్రి అయ్యేది జగనన్నే నన్నారు. రాజమహేంద్రవరలో వై ఎస్సార్ సీపీ జెండా రెపరెపలాడడం ఖాయమన్నారు. నగరంలో రాజకీయ పదవులు 16 ఏళ్లు అనుభవించినా ఆదిరెడ్డి కుటుంబం నగరానికి, ప్రజలకు ఏం చేయలేదన్నారు. తాను వచ్చిన తరువాత నగరం అభివృద్ధి చెందిందన్నారు. వచ్చే ఎలక్షన్‌లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి తనను గెలిపించే మరింత అభివృద్ధి చేస్తానని తెలిపారు.

రేపు మార్గాని భరత్ రామ్ నామినేషన్

వైఎస్సార్ సీపీ సిటీ ఎమ్మెల్యే అభ్యర్థిగా సోమవారం నామినేషన్ వేయనున్నట్టు ప్రకటించారు. నగరంలోని అన్ని వార్డుల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ఆశీర్వదించాలని ఎంపీ కోరారు. ఎంపీగా నగరానికి చేసిన అభివృద్ధి కేవలం ట్రైలర్ మాత్రమేనని, ఎమ్మెల్యేగా గెలిపిస్తే నగర రూపురేఖలు పూర్తిగా మార్చివేస్తానని చెప్పారు. రేపు ఎన్నికలలో సిటీ ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ స్టేడియం నిర్మాణాలతో పాటు విశ్వ నగరంగా అభివృద్ధి చేసి చూపిస్తానన్నారు. పేపర్ మిల్లు కార్మికులు తమ న్యాయమైన డిమాండ్ల సాధన నిమిత్తం గత 16 రోజులుగా ఆందోళన చేస్తున్నా మిల్లు యాజమాన్యం స్పందించకుండా మొండి వైఖరిని అవలంబించడం దారుణమని ఎంపీ భరత్ రామ్ ధ్వజమెత్తారు.కార్మికుల ఆందోళన విషయాన్ని స్వయంగా నేను సీఎంకు తెలియజేశానన్నారు. బస్సు యాత్రలో కార్మికులతో సీఎం నేరుగా మాట్లాడి సమస్య తెలుసుకున్నారన్నారు. ప్రస్తుతం ఎన్నికల కోడ్ ఉండడం వల్ల, ఎన్నికలు అయిన తరువాత పరిశీలిస్తానని తప్పక న్యాయం చేస్తానని హామీ ఇచ్చారని ఎంపీ తెలిపారు. గత మూడున్నర సంవత్సరాలుగా పే రివిజన్ జరగడం లేదని, మిల్లు యాజమాన్యం కార్మికులను తమ సొంత బిడ్డల్లా చూడాలని, అటువంటిది మొండి వైఖరి అవలంబించడం చాలా దుర్మార్గమైన చర్య అన్నారు. కచ్చితంగా కార్మికుల పక్షాన ఉండి, న్యాయ పోరాటంలో కీలక పాత్ర పోషిస్తామని ఎంపీ భరత్ రామ్ తెలిపారు ఈ సమావేశంలో రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు, నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, పార్టీ పరిశీలకుడు రావిపాటి రామచంద్రరావు, నందెపు శ్రీనివాస్, నక్కా శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుని ఆశీస్సులు అందరికీ అందాలి

రుడా చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు


స్వామివారిని దర్శించుకుంటున్న రౌతు సూర్యప్రకాశరావు

రాజమహేంద్రవరం రూరల్: భక్త జన బాంధవుడు వేంకటేశ్వర స్వామి వారి ఆశీస్సులు అందరికీ అందాలని రాజమహేంద్రవరం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (రుడా) చైర్మన్ రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. స్థానిక నామవరం రోడ్డులోని పిట్టల వాని చెరువు సమీపంలో నివర ప్రదాయ వేంకటేశ్వరస్వామి ఆలయం 14వ వార్షికోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రౌతు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ ధర్మకర్త కొప్పిశెట్టి రామ చంద్రరావు భక్తి శ్రద్ధలతో ఆలయాన్ని అశేష భక్తులకు చేరువ చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వేణు గోపాల రావు, పూడి శ్రీనివాస రావు, కృష్ణ, ధర్మవరపు శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్ వాకచర్లకృష్ణ, తలుపూరి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు అన్నదానం

కడియం: స్థానిక పడాలవారి వీధిలోని సీతారామ చంద్రస్వామి వారి ఆలయం వద్ద ఆదివారం అన్నదానం నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ తెలిపింది. భక్తులు ఈ కార్యక్రమానికి విచ్చేసి ప్రసాదాలను స్వీకరించాలని కోరారు.

క్లుప్తంగా

క్లౌడ్ కంప్యూటింగ్‌పై నేషనల్ వెబినార్

కంబాలచెరువు: కందుకూరి రాజ్యలక్ష్మి ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో కమిషనర్ ఆఫ్ ఎడ్యుకేషన్‌క డాక్టర్ పోల భాస్కర్, ఆర్జేడీ డాక్టర్ ఎస్.శోభారాణి, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.రాఘవ కుమారి ఆధ్వర్యంలో క్లౌడ్ కంప్యూటింగ్ పై శనివారం నేషనల్ వెబినార్ జరిగింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నేటి ప్రపంచం కంప్యూటర్ పైనే నడుస్తోందని, విద్యార్థినులందరూ నేషనల్ వెబినార్‌ను సద్వినియోగపరచుకోవాలన్నారు. రిసోర్స్ పర్సన్లు ఎ.ప్రియ క్లౌడ్ కంప్యూటింగ్‌పై అవగాహన కల్పించారు. సంస్థల లోపాలను తొలగించడానికి వెబినార్ ఎంతో సహాయపడుతుందని అన్నారు. కార్యక్రమం నిర్వహించిన కంప్యూటర్ సైన్స్ విభాగాధిపతి మోనికామహద్, అధ్యాపకురాలు భువనేశ్వరిలను ప్రిన్సిపాల్ అభినందించారు.

రెండు నామినేషన్లు దాఖలు

రాజమహేంద్రవరం రూరల్: సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి రాజమహేంద్రవరం రూరల్ నియోజకవర్గానికి శనివారం రెండు నామినేషన్లు వచ్చినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. కలెక్టరేట్ ఆవరణలో జాయింట్ కలెక్టర్ చాంబర్‌లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా బొద్దాపు శివవిష్ణుప్రసాదరావు, భారత చైతన్య యువజన పార్టీ తరపున దుగ్గిరాల శ్రీదేవి నామినేషన్లు దాఖలు చేశారన్నారు.

అన్నవరప్పాడులో భక్తుల రద్దీ

పెరవలి: అన్నవరప్పాడులో కొలువు దీరిన వేంకటేశ్వర స్వామి వారి దర్శనానికి శనివారం భక్తులు పోటెత్తారు. స్వామి, అమ్మవార్లను పురోహితులు వివిధ రకాల పూలతో సుందరంగా అలంకరించారు. తెల్లవారుజామున స్వామి వారికి అభిషేకం నిర్వహించిన అనంతరం భక్తులను దర్శనానికి అనుమతించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు ఉదయం ఉచిత ప్రసాదాలతో పాటు 10 గంటల నుంచి అన్న సమారాధాన చేశారు. అన్న సమారాధనలో 5 వేల మంది భక్తులు స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారని ఆలయ ఈఓ మీసాల రాధాకృష్ణ తెలిపారు. వేసవి కావడంతో ఆలయంలో మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించారు.

వాహన తనిఖీలు


జగన్నాథపురం వద్ద సరిహద్దు చెక్‌పోస్టును పరిశీలిస్తున్న రోహిత్ నాయర్

గోపాలపురం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా సరిహద్దుల వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల్లో వాహన తనిఖీలను ముమ్మరం చేయాలని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు రోహిత్ నాగర్ అన్నారు. గోపాలపురం మండలం జగన్నాథపురంలో జిల్లా సరిహద్దు వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టును శనివారం ఆయన పరిశీలించారు. పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్దీ ప్రతి వాహనాన్నీ నిశితంగా తనిఖీ చేయాలని అక్కడి సిబ్బందికి ఆయన సూచించారు. అనంతరం గోపాలపురరం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రికార్డులను రోహిత్ నాగర్ పరిశీలించారు. ఆయన వెంట ఆర్వో కె.లక్ష్మీశివ జ్యోతి, ట్రైనీ కలెక్టర్ కె.సువర్ణ, నియోజకవర్గ వ్యయ పరిశీలకులు కె సుబ్బారావు, తహసీల్దార్ డి.వనజాక్షి, డీటీ సాకే కృష్ణ వెంట ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొవ్వూరు: గామన్ ఇండియా వంతెనపై శుక్రవారం రాత్రి 10.30 గంటల సమయంలో ఎదురెదురుగా వస్తున్న రెండు మోటార్ సైకిళ్లు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో రాజానగరానికి చెందిన పలివెల కరుణకుమార్ అనే యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. కరుణకుమార్ కొవ్వూరు వైపు నుంచి రాజమహేంద్రవరం వైపు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న మరో మోటారు సైకిల్ ఢీ కొట్టింది. దీంతో కరుణకుమార్‌తో పాటు ఎదురుగా వచ్చిన మరో మోటారు సైకిల్ నడిపే వ్యక్తికి కూడా తీవ్ర గాయాలైనట్టు కొవ్వూరు టౌన్ పోలీసు స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఆర్.సత్యనారాయణ తెలిపారు. క్షతగాత్రుడు కరుణకుమార్ ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేశామన్నారు.

సినిమాలు



శ్యామల	: గీతాంజలి మళ్లీ వచ్చింది
సూర్యమినీ	: పారిజాతపర్వం, దిఫస్ట్‌ఒమెన్
సూర్యప్యాలెస్	: గాడ్జిల్లా అండ్ కాంగ్
స్వామి	: ది ఫ్యామిలీస్టార్
శివజ్యోతి	: లవ్‌గురు
అనుశ్రీ	: మంజుమ్మల్‌బాయ్స్
రాజా	: బడేమియా చోటేమియా
ఊర్వశి	: హ్యాపీడేస్
రంభ	: లవ్‌యుశంకర్
మేనక	: టెనెంట్
అప్సర	: టిల్లుస్క్వేర్
కుమారి	: మార్కెట్ మహాలక్ష్మి
నామవరం	
వీఎస్ మహల్ ధవళేశ్వరం	: గీతాంజలి మళ్లీ వచ్చింది
మురళీకృష్ణ	: గీతాంజలి మళ్లీ వచ్చింది

పేదలకు సంతృప్తికరంగా విద్య, వైద్యం

- అర్హులందరికీ ఇంటి ముంగిటకే సంక్షేమ పథకాలు
- మంత్రి, రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణు
- 28వ డివిజన్‌లో ఇంటింటా ప్రచారం


28వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం చేస్తున్న మంత్రి వేణుగోపాలకృష్ణ

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): పేదలకు విద్య, వైద్యం సంతృప్తిగా అందించటమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ చెప్పారు. నగరపాలక సంస్థ పరిధిలోని 28వ డివిజన్‌లో డివిజన్ ఇన్‌చార్జి బిల్డర్ చిన్న ఆధ్వర్యంలో శనివారం ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులతో మంత్రి వేణు ఇంటింటికీ వెళ్లి ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి గడచిన 58 నెలల కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందించిన సంక్షేమ ఫలాలను వివరించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాల ద్వారా లబ్ధి చేకూరిందన్నారు. ఈ సందర్భంగా చెల్లుబోయిన వేణుకు స్థానికులు హారతుల తీసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మంత్రి వేణు మాట్లాడుతూ సామాన్యులు అనారోగ్యం పాలైతే ఆర్థికస్తోమత లేనప్పుడు అప్పులు చేసి మరీ కుటుంబ సభ్యులను కాపాడుకోవాల్సిన పరిస్థితి ఉంటుందన్నారు. ఆ పరిస్థితికి చరమగీతం పాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అన్ని రకాల వ్యాధులను ఆరోగ్యశ్రీలో అవకాశం కల్పించడంతో పాటు ఆరోగ్యశ్రీ ఖర్చు రూ.25 లక్షల వరకు ప్రభుత్వమే భరించేలా ఉత్తర్వులు జారీ చేశారన్నారు. అదేవిధంగా ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ మీడియంతో పాటు నాడు–నేడు కింద ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌స్థాయిలో తీర్చిదిద్దారని గుర్తుచేశారు. వాటితో పాటు అమ్మఒడి పేరుతో పిల్లలను పనికి పంపించకుండా బడికి వెళ్లేలా ఆర్థిక సాయం చేయడం కూడా మరెక్కడా లేదన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి ఒక్కరు రెండు ఓట్లు ఫ్యాన్‌గుర్తుకు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా తనను, ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను గెలిపించాలని కోరారు. మాజీ డిప్యూటీ మేయర్, ట్రేడ్ యూనియన్ నాయకుడు బాక్స్ ప్రసాద్ మాట్లాడుతూ టీడీపీ హయాంలో ప్రజలకు తీరని అన్యాయం జరిగిందని, మంచి చేసిన సీఎం జగనన్నను మరోసారి గెలిపించుకుందామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కనకాల రాజా, దారపురెడ్డి రామకృష్ణ, సంకు సత్తి రాజు, బోట్ రాము, బూర కనకలింగేశ్వరరావు, బూరాడ గౌరిశంకర్, కట్టా క్రాంతి, రాజేశ్వరి, కోసన కనకదుర్గా దేవి, విజయ కుమార్, గోపి, ప్రకాష్, వీనం శ్రీను, వంద్రపు సూర్య, డాక్టర్ బాబ్జీ, పడమట కామరాజు, రాయుడు కాక, యలమంచిలి వాసు, కోళ్లి దీపు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఉద్భవ్–2024


కార్యక్రమంలో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ రామచంద్రయ్య

కంబాలచెరువు: ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాలలో గత మూడు రోజులుగా జరుగుతున్న వార్షిక సంస్కృత ఉత్సవాలు ఉద్భవ్–2024 శనివారంతో ముగిశాయి. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.రామచంద్రరావు ఆధ్వర్యంలో విద్యార్థుల్లోని సృజనాత్మకతను, ప్రతిభను, నాయకత్వాన్ని పెంపొందించేలా ఈ ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ఈ ఉత్సవానికి విద్యార్థులే నేతృత్వం వహించి నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థుల మధ్య సామాజిక సంబంధాలు పెంపొందించడానికి, నైపుణ్యాల ప్రదర్శనకు, కళాత్మక వ్యక్తీకరణకు, ఆలోచనల వినియోగం, విభిన్న నేపథ్యాల నుంచివచ్చిన వారితో ఆరోగ్యకరమైన సంబంధాలు పెంపొందించుకోవడానికి ఈ ఉత్సవం ఒక వేదికగా మారిందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అనే నినాదంతో ప్రారంభమైన ఈ ఉత్సవం విభిన్న సాంస్కృతిక ప్రదర్శనలు, ఆహారం, ఆటలు, ప్రమోషన్ స్టాల్స్ అలరించాయన్నారు. ప్రముఖ నాట్యాచార్యులు మేడిది నాగేశ్వరరావు, పసుమర్తి శ్రీనివాస శర్మ, సంగీత విద్వాంసులు ఎస్.మధుసూదన్ ఈ కార్యక్రమానికి న్యాయనిర్ణేతలుగా వ్యవహరించారన్నారు. ఈ ఉత్సవంలో ముగింపు సమావేశానికి కళాశాల ఉన్నత విద్యాశాఖ ఆర్జేడీ డాక్టర్ శోభారాణి, ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం రిజిస్టర్ ప్రొఫెసర్ సుధాకర్, కళాశాల పూర్వ విద్యార్థి, తిరుమల విద్యాసంస్థల అధినేత ఎం.తిరుమల రావులు ముఖ్యఅతిథులుగా విచ్చేసి పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారన్నారు. కార్యక్రమానికి సాంస్కృతిక సమన్వయకర్తలుగా విద్యార్థులు విక్రమ్, వాని, ఫెస్ట్ సమన్వయకర్తలుగా సత్యం సూర్యనారాయణ, జి.రాకేష్, పాత్రికేయ సమన్వయకర్తగా సింగవరపు రాజభూషణం వ్యవహరించారు.

ఎన్నికల విధులపై పూర్తి అవగాహన ఉండాలి

- శిక్షణా తరగతులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకోవాలి
- రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ తేజ్‌భరత్



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ తేజ్‌భరత్

రాజమహేంద్రవరం రూరల్: ఓటింగ్‌కు సంబంధించిన ఈవీఎంల పని తీరుపై శిక్షణ తరగతులను పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని, సెక్టార్ అధికారులు, అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్లు, ప్రిసైడింగ్ అధికారులు, సహాయ ప్రిసైడింగ్ అధికారులకు ఈవీఎం పనితీరుపై పూర్తి అవగాహన ఉండాలని రూరల్ నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్ అన్నారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఆయన ఆధ్వర్యంలో రాజమండ్రి రూరల్ అసెంబ్లీ నియోజకవర్గ సెక్టార్ అధికారులకు, ఎన్నికల సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, సాధారణ ఎన్నికలు–2024కి డిస్ట్రిబ్యూషన్ , రిసెప్షన్ సెంటర్ కేంద్రాలలో నిర్వహించాల్సిన విధులు, బాధ్యతలపై అవగాహన కల్పించారు. కమిషనింగ్ ఆఫ్ ఈవీఎం, డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ సెంటర్లలో జరిగే పని తీరుని వివరించారు. అధికారులందరూ ఎటువంటి తప్పులు జరగకుండా పని చేయాలని సూచించారు. ఎటువంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలని, ఇందులో భాగంగా షర్ట్ వీడియో క్లిప్ కూడా అందజేసినట్లు తెలిపారు. మాక్ పోల్‌లో అధికారులు పాటించాల్సిన నియమాలను వివరించారు. ఈ సమావేశంలో, డిప్యూటీ కలెక్టర్ ఐ.సాయి బాబు, రూరల్ తహసీల్దార్ వై.కె.వి.అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

నయనానందం వేంకటేశ్వరుని కల్యాణం


కడియపులంక హరిహర మహాక్షేత్రంలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

కడియం: కడియపులంక హరిహర మహా క్షేత్రంలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం శుక్రవారం రాత్రి కనుల పండువగా జరిగింది. ఆలయం ఎదురుగా ఏర్పాటు చేసిన వేదికలో కల్యాణాన్ని పండితులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రాంగణంలో స్వామి,అమ్మవార్లను ప్రత్యేక వాహనంపై ఉంచి అలంకరించారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, విశేష బాణసంచా కాల్పులు, భక్తుల నడుమ స్వామివారిని అమ్మవారిని కల్యాణ వేదిక వద్దకు తీసుకొని వచ్చారు. ఆలయ చైర్మన్ మార్గాని సత్యనారాయణ లక్ష్మి దంపతులు సంప్రదాయంగా పట్టు వస్త్రాలను సమర్పించారు. వేదమంత్రోచ్ఛారణలు, బాజా భజంత్రీల నడుమ కల్యాణాన్ని జరిపించారు. భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు.

వైభవంగా కల్యాణం

కడియం: స్థానిక కెనాల్‌రోడ్డులోని రాజవీధిలో ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి కల్యాణం శుక్రవారం రాత్రి వైభవంగా జరిగింది. స్వామివారి తిరు కల్యాణోత్సవాన్ని వైఖానస ఆగమ శాస్త్ర రీత్యా వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారిని వైఎస్సార్ సీపీ నాయకులు గిరజాల వీర్రాజు, మండల జేసీఎస్ కన్వీనర్ తాడాల చక్రవర్తి, మహిళా నాయకులు ఊటుకూరి శైలజ, దుళ్ల ఉపసర్పంచ్ తోకల శ్రీనివాసరావు, కడియం ఎంపీపీ వి.సత్యప్రసాద్, ప్రజాప్రతినిధులు, నాయకులు దర్శించుకున్నారు.

వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యం


పార్టీలో చేరినవారికి కండువాలు వేసి ఆహ్వానిస్తున్న జక్కంపూడి గణేష్

- వైఎస్సార్ సీపీ యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్
- టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీలో చేరికలు

సీతానగరం: వైఎస్సార్ సీపీ విజయమే లక్ష్యంగా పనిచేద్దామని ఉభయ గోదావరి జిల్లాల యువజన విభాగం రీజినల్ కోఆర్డినేటర్ జక్కంపూడి గణేష్ పిలుపునిచ్చారు. శనివారం చినకొండేపూడిలో వైఎస్సార్ సీపీ నాయకుడు వడ్లమూరి బలరామరాజు ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన కోడ మంచాలి కుమార్, చిడిపి సుబ్బారావు, ఆరుగోళ్ల వెంకట సత్యనారాయణ, తటపూడి ఏసు, చిరా బస్కరావు, చిడిపి సురేష్, చిడిపి తొండయ్య తదితరులతోపాటు 100 మందికి వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి జక్కంపూడి గణేష్ పార్టీ కండువా వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సంద ర్భంగా జక్కంపూడి గణేష్ మాట్లాడుతూ పార్టీ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి రాజమహేంద్రవరం పార్లమెంట్ నియోజకవర్గం అభ్యర్థి గూడూరు శ్రీనివాస్, రాజానగరం నియోజకవర్గం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా గెలుపునకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ–1 ముదునూరి సురేష్‌రాజు, మండల కన్వీనర్ ఘంటా శ్రీనివాస్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు కొండ్రపు ముత్యాలు, సర్పంచ్ చెరుకూరి శ్రీనివాస్, ఉపసర్పంచ్ చేకూరి సత్తిపండురాజు, పార్టీ నాయకులు ముదునూరి రామకృష్ణరాజు, యర్రంశెట్టి బాబులు, వడ్లమూరి రవి, ముదునూరి సుబ్రహ్మణ్యం రాజు, కోసూరి నాగరాజు, వడ్లమూరి నరసింహరాజు, సూరపురెడ్డి రామకృష్ణ, ముదునూరి ప్రసాదరాజు, పత్తి వెంకటేష్లు, చిడిపి బంగారయ్య తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పరామర్శ


జీఎస్ఎల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి తానేటి వనిత

రాజానగరం: రోడ్డు ప్రమాదానికి గురై రాజానగరం, రాజమహేంద్రవరం ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న గోపాలపురానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్తలు, అభిమానులను రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత శనివారం పరామర్శించారు. శుక్రవారం నామినేషన్ దాఖలు చేసే కార్యక్రమం సందర్భంగా నిర్వహించిన ర్యాలీలో పాల్గొని, తిరిగి వెళ్తున్న సమయంలో కొంతమంది రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ సంఘటనలో గాయపడి స్థానిక జీఎస్ఎల్ జనరల్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న నల్లజర్ల మండలం, పోతవరానికి చెందిన మిర్యాల రాంబాబును మంత్రి పరామర్శించి, మానసిక ధైర్యాన్ని అందించారు. రాజమహేంద్రవరంలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న అదే మండలానికి చెందిన కలపాల గణేష్‌బాబు, దేవరపల్లి మండలం కురుకురుకు చెందిన పల్లపు అబ్బులను పరామర్శించారు. అండగా ఉంటానంటూ వారి కుటుంబ సభ్యులకు ధైర్యాన్నిచ్చారు. మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా చూడాలని వైద్యులతో మాట్లాడారు. నామినేషను దాఖలు కార్యక్రమం ఎంతో ఆనందంగా జరిగిన వేళలో ఇటువంటి ప్రమాదానికి కొంతమంది గురికావడం తీవ్ర మనస్తాపానికి గురి చేసిందన్నారు. ఆమె వెంట ఆయా మండలాలకు చెందిన వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నారు.

కానూరులో బేటీ బచావో – బేటీ పఢావో

పెరవలి: మండలంలోని కానూరు ఉన్నత పాఠశాలలో శనివారం బేటీ బచావో–బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరస్వతి మాట్లాడుతూ యుక్త వయసు బాలికల్లో శరీర మార్పులు వచ్చేటప్పుడు అనేక రకాల ఇబ్బందులు ఉంటాయన్నారు. వాటిని అధిగమించేందుకు ఆరోగ్యకరమైన ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు. తరగతి గదిలో విద్యార్థినులకు ఏదైనా సమస్య వచ్చినపుడు ముందుకు క్లాస్ టీచర్‌కు చెప్పి తరువాత తల్లిదండ్రులకు, అంగన్‌వాడీ టీచర్లకు తెలియపరచాలన్నారు.

1 నుంచి యోగా, చెస్ శిక్షణ

నల్లజర్ల: స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో దూబచర్లలో మే1 నుంచి 31 వరకూ యోగా, చెస్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తామని దూబచర్ల జెడ్పీ హైస్కూల్ ఫిజికల్ డైరెక్టర్ దూబగుంట్ల రాజారావు శనివారం తెలిపారు. రోజూ ఉదయం 6 నుంచి 7 గంటల వరకూ శిక్షణ కార్యక్రమం జరుగుతుందన్నారు. ఉదయం 7నుంచి 8 గంటల వరకు చెస్‌లో ప్రత్యేక శిక్షణ ఉంటుందన్నారు.